వైఎస్ఆర్
కడప-అన్నమయ్య వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
శనివారం 14 మార్చి 2026

రైతుల ఖాతాల్లో 4.19 కోట్లు జమ

దువ్వూరు, మార్చి 13, ప్రభాతవార్త: మండల పరిధిలోని రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద 4 కోట్ల 19 లక్షల రూపాయలు జమ అవుతాయని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రం నందు పీఎం కిసాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ కింద 7071మంది రైతులకు 2 కోట్ల 83 లక్షల రూపాయలు అలాగే పీఎం కిసాన్ పథకం కింద 1కోటి 36 లక్షల రూపాయలు విడుదల అయ్యాయన్నారు. మొత్తం 4 కోట్ల 19 లక్షల రూపాయలు రైతుల ఖాతాలకు 2, 3 రోజుల్లో జమ అవుతాయని తెలిపారు. రైతులకు వచ్చిన ఈ నిధులతో తమ వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

20162మంది రైతులకు రూ.11.73కోట్లు విడుదల

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త : పట్టణంలోని బిడిఎస్ పంక్షన్‌హాలులో అన్నదాత సుఖీ భవ, కిసాన్ పథకం నిదులు విడుదల చేసినందుకు ముఖ్య మంత్రికి ఎమ్మెల్యే, టిడిపి నా యకులు, రైతులు ధన్యవాదలు తెలిపారు. ఈసందర్భంగా నేడు నియోజకవర్గంలోని 20162 మంది రైతులకు రూ.11.73 కోట్లు నిధులు రైతుల ఖాతాల్లో నేదరుగా జమ చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడిఉందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఈ కార్యకమంలో ఎమ్మెల్యే తో పాటు టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దేశానికి మరింత సృజనాత్మక..

నాయకులు అవసరం

పట్టభద్రులు సమాజాభివృద్ధి,దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలి..

ఛాన్సలర్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ఘనంగా యోగి వేమన విశ్వవిద్యాలయం 11,12,13,14 వ స్నాతకోత్సవ వేడుకలు

176 మంది ప్రతిభా వంతులకు బంగారు పతకాలు

70 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు ప్రదానం

ఏరో స్పేస్ శాస్త్రవేత్త మరియు సలహాదారు డా.కోటా హరినారాయణ,

సైంటిస్ట్ మరియు లీడర్ డా. శేఖర్ సి.మండేలకు గౌరవ డాక్టరేట్‌ల ప్రదానం..

పట్టాలందుకొనేందుకు తరలి వచ్చిన విద్యార్థులు.

కడప, మార్చి 13 ప్రభాతవార్త: పట్టభద్రులు సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఛాన్సలర్ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి బైపాస్ రోడ్డులోని పాలెం పల్లె దగ్గర ఉన్న డిఎస్ఆర్ పారడైజ్ ఫంక్షన్ హాల్ నందు యోగి వేమన యూనివర్సిటీ 11,12,13,14 వ స్నాతకోత్సవం వేడుకల్లో ఛాన్సలర్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఏరో స్పేస్ ప్రముఖ శాస్త్రవేత్త డా. కోట హరినారాయణ,హోనరిస్ కాజా గౌరవ డాక్టరేట్ స్వీకరించిన డా.శేఖర్ సి. మాండే హాజరు కాగా యోగి వేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రో.బెల్లం కొండ రాజశేఖర్,యోగి వేమన యూనివర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ పద్మ ,ప్రొఫెసర్ మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.ముందుగా ఏరో స్పేస్ శాస్త్రవేత్త మరియు సలహాదారు డా.కోటా హరినారాయణ,సైంటిస్ట్ మరియు లీడర్ డా. శేఖర్ సి.మండేలకు యోగివేమన విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌లను గౌ.ఛాన్సలర్ మరియు గౌ.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన 176 మంది విద్యార్థులకు ఛాన్సలర్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బంగారు పతకాలు అందజేశారు.70 మంది విద్యార్థులకు డాక్టరేట్‌ల ప్రదానం చేశా రు.2021, 2022, 2023, 2024 సంవత్సరాల్లో గ్రాడ్యుయేట్స్, పీజీ గ్రాడ్యుయేట్స్ పూర్తి చేసుకున్న 1,194 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం జరిగింది.మరో 11,664 మంది డిగ్రీ విద్యార్థులు కాన్వకేషన్ ద్వారా వారి డిగ్రీలకు అర్హత పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ కడప జిల్లా గొప్ప చారి త్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని తెలిపారు. విద్యార్థులను మరింత నైపుణ్యాలతో, సృజనాత్మకతతో పోటీ ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దడం ఈ విధాన ప్రధాన లక్ష్యమని పేర్కొ న్నారు. ఉన్నత విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోం దని తెలిపారు.ఉన్నత విద్య కోసం 1,39,289.48 కోట్ల బడ్జెట్ కేటాయించగా, అందులో 55,727.22 కోట్లను ఉన్నత విద్యాభివృద్ధికి వినియోగించనున్నట్లు చెప్పారు.మానవ మూలధనం, డిజిటల్ లెర్నింగ్ మరియు నైపుణ్యాభివృద్ధి వంటి ముఖ్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వ బడిందని తెలిపారు. భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలు మరియు ఆధునిక సాంకేతికతపై దృష్టి పెట్టాల్సిన అవ సరం ఉందన్నారు. ఈ సందర్భంగా పతకాలు మరియు డిగ్రీలు అందుకున్న విద్యార్థులందరికీ ఆయన మిగతా 2వ పేజీలో

బ్రహ్మోత్సవాల పనులు సకాలంలో

పూర్తి చేయాలి

ఈనెల 16న నిత్య అన్నప్రసాద వితరణ కు శ్రీకారం

టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

మార్చి.13.ఒంటిమిట్ట, ప్రభాతవార్త : రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలం ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో రామాలయం వద్ద అదేవిధంగా కళ్యాణ వేదిక వద్ద టిటిడి ఆధ్వర్యంలో గుత్తేదారులు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం శుక్రవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఒంటిమిట్టకు రావడం జరిగింది. ముందుగా ఆయన శ్రీ కోదండరామ స్వామిని దర్శించుకుని గుత్తేదారులు నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గుత్తేదారులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు సమయం తక్కువగా ఉన్నదని కావున బ్రహ్మోత్సవాల పనులన్నీ ఎటువంటి రాజి లేకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఒంటిమిట్టలో జరుగుతున్న పనులను తన అధికారులతో పరిశీలించాడు. శ్రీ కోదండ రామస్వామిని దర్శించేందుకు వస్తున్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి నిత్య అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు స్పష్టం చేశాడు. అన్ని శాఖలకు చెందిన టిటిడి అధికారులు జిల్లాస్థాయి ప్రభుత్వ అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకొని అనుకున్న ప్రకారం పనులన్నీ పూర్తి చేయాలన్నాడు. ఆలయ పరిసరాల్లోని నాలుగు మాడవీధులు, నిత్య అన్నదాన భవనము, కళ్యాణ వేదికను ప్రత్యేకంగా పరిశీలించాడు. టీటీడీ, జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించాడు. ఆ సమీక్షలో నిర్వహించాల్సిన ఏర్పాట్లపై చర్చించడం జరిగింది. ప్రత్యేకించి ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం నిర్వహించే సీతారామ కళ్యాణ ఏర్పాట్ల, భక్తుల మొలిక సదుపాయాల గురించి, అన్ని విషయాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఎస్ ఈ వెంకటేశ్వర్లు, గార్డెన్ సూపరిండెంట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవోలు సెల్వం, శివ ప్రసాద్, డి ఈ రవి శంకర్ రెడ్డి, ఆలయ టిటిడి సిబ్బంది తదితరులు ఉన్నారు.

భవిష్యత్తులో నందలూరు రైల్వే ప్రాంగణ

అభివృద్ధికి అవకాశం

ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డికి కేంద్ర రైల్వే మంత్రి సమాధానం

రాజంపేట, మార్చి 13 ప్రభాతవార్త సువిశాలమైన రైల్వే ప్రాంగణం ఉన్న నంద లూరులో భవిష్యత్తులో రైల్వే పరంగా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి రాజ్యసభలో నందలూరు రైల్వే అభివృద్ధి పై ప్రశ్నించారు. ముంబై-చెన్నై ప్రధాన రైల్వే మార్గంలోని రేణిగుంట-కడప సెక్షన్‌లో ఉన్న నందలూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించారు. నందలూరు రైల్వే స్టేషన్ గతంలో లోకో షెడ్, నీటి సరఫరా కేంద్రంగా కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు.అక్కడ ఉన్న ఖాళీ రైల్వే భూమిని ఉపయోగించి రైల్వే కార్యకలాపాలను మరింత అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.దీనికి స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానంలో నందలూరు స్టేషన్ ప్రస్తుతం క్రియాశీలంగా ఉందని, అక్కడ 24.36 ఎకరాల ఖాళీ రైల్వే భూమి అందుబాటులో ఉందని తెలిపారు. భవిష్యత్తులో రైల్వే అవసరాలను బట్టి మల్టీ ట్రాకింగ్, ఫ్రైట్ టెర్మినల్స్ , ఇతర మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఆ భూమిని వినియోగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంస్థల బకాయిలు

రూ.76.96 కోట్లు..

కడప కార్పొరేషన్ మార్చి 13 ప్రభాతవార్త: కడప నగరపాలక సంస్థ ఆర్థిక సంక్షోభంలో ఉన్నది. నగరానికి నిధుల కొరత ఉన్నది. కడప నగరంలో మౌలిక వసతులు, ప్రజా అవసరాలకు నిధులు ఉన్నది. సాధారణ నిధులను ప్రభుత్వం వాడేసుకుంటుంది. ప్రభుత్వం నుంచి హక్కు వాటాగా రావాల్సిన నిధులు కార్పొరేషన్ కు అందడం లేదని కడప మేయర్ పాక సురేష్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ సంస్థల నుంచి రూ.76,96,06,868 పన్నుల బకాయిలు ఉన్నాయని వెల్లడించారు. శుక్రవారం తన చాంబర్ లో విలేకరుల సమావేశంలో మేయర్ పాక సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు సక్రమంగా రాకపోవడంతో కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టాంపు డ్యూటీ కింద రూ. 54 కోట్ల బకాయి రావాల్సి ఉందని తెలిపారు. అమృత స్కీమ్ సంబంధించిన రూ.17 కోట్లు విత్ హెల్డ్ లో ఉందని, ఈ నిధులు వస్తాయో లేదో ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. క్లాప్ భారంగా మారిందని పేర్కొన్నారు. నిధులు లేకపోవడంతో మౌలిక వసతులు కల్పన భారంగా మారిందని తెలిపారు. టెండర్లు పూర్తయిన జనరల్ ఫండ్ అంటే నిధులు వస్తాయో రావో అని కాంట్రాక్టర్లు భయపడుతున్నారని చెప్పారు. ప్రజల నుంచి పన్నులు రాబట్టడంలో ఉన్న శ్రద్ధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావలసిన పన్నులపై కూడా దృష్టి సారించాలని పేర్కొన్నారు. పేదలను ఒత్తిడి చేసే వీరు పెద్దలను చేయలేరని ప్రశ్నించారు. మొండి బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విషయాన్ని కమీషనర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

పైలట్ భార్య ఉరి వేసుకుంటుంటే

వీడియో తీసిన కసాయి భర్త

పీకలదాకా తాగి 24 గంటపాటు భార్య శవంతోనే ఇంట్లో

పోలీస్ స్టేషన్ వద్ద కృష్ణవేణి బంధువుల ఆందోళన

రైల్వే లోకో పైలెట్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కృష్ణవేణి పెళ్లి నాటి ఫోటో

రాజంపేట, మార్చి 13 ప్రభాతవార్త ఆయన రైల్వేలో ఉన్నత ఉద్యోగి. ఆయన మొదటి భార్య,భర్త వేధింపులు తాళలేక ఆత్మ హత్య చేసుకుంది. రెండో వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు పుట్టినా ఆమెతో సఖ్యత లేదు. ప్రతి రోజు కలహాలే. భర్త వేధింపులతో ఆమెకు దినదిన గండం నూరేళ్లుగా మారింది. రైల్వేలో వేల రూపా యలు జీతం తీసుకుంటున్నా ఇంకా అదనపు కట్నం కావాలంటూ వేధింపులు తగ్గలేదు. జీవితంపై విర క్తి చెందింది. తనువు చాలించాలనుకుంది. తన చావుతోనైనా భర్త మారతాడని భావించింది. భర్త లేన్పుడు ఎందుకు ఆయన చూస్తుండగానే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయం తీసుకుంది. భర్త ఏమైనా కాపాడుతాడనుకుందో ఏమో తెలియదు కానీ భర్త బయట ఉండగానే ఆత్మహత్యకు పాల్పడింది. ఇక్కడే పెద్ద ట్విస్ట్. భార్య ఆత్మహత్యకు పాల్పడుతుంటే ఇంకా బాగా వేసుకోవాలని, ఉరి అలా కాదు ఇలా వేసుకోవాలని సలహాలు ఇవ్వడమే కాదు ఏకంగా వీడియో కూడా తీశాడు. అంతేకాదు పీకల దాకా మందు తాగి 24 గంటలు పాటు భార్య మృతదేహంతోనే ఇంట్లోనే గడిపిన శాడిస్ట్, సైకో పైలట్ శ్రీరామ్ శ్రీనివాస్‌కు సంబంధించిన వివరాలలోకెళితే... రాజంపేట మండలం బోయినపల్లి గ్రామంలో నివాసం ఉంటూ రైల్వే లోకో పైలట్‌గా పనిచేస్తున్న శ్రీరామ్ శ్రీనివాస్ నందలూరుకు చెందిన కృష్ణవేణిని 9 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.బుధవారం భార్య కృష్ణవేణి గొడవ పడ్డట్టు తెలిసింది. అయితే ఈ గొడవలు వీరికి నిత్యమేనని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజు గొడవపడటం తర్వాత మామూలుగా ఉండటం సర్వసాధారణమే అనుకున్నారు. బోయినపల్లి సమీపంలోని అన్నమయ్య కోచింగ్ సెంటర్‌ను శ్రీరామ్ శ్రీనివాస్ నడుపుతున్నాడు. రేణిగుంటలో రైల్వే లోకో పైలట్గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల గొడవ తర్వాత కృష్ణవేణి ఉరి వేసుకొని చనిపోతానని భర్తతో చెప్పినట్లు తెలుస్తోంది. అయితే శ్రీనివాస్ ఏమాత్రం చలించనట్లు తెలుస్తోంది. భార్య ఉరి వేసుకుంటుంటే బయట నుంచి కిటికీలో ఇలా కాదు ఇలా వేసుకో అంటూ చెబుతున్నట్లు వీడియోలు స్పష్టంగా కనిపిస్తోంది. బుధవారమే కృష్ణవేణిని చంపారని ఆమె బంధువులు చెప్తున్నారు. రైల్వే ఉద్యోగి ఒంగోలులోని తన బంధువులకు తన భార్య చనిపోయిందని సమాచారం అందించాడు. శ్రీనివాస్ బంధువులు వచ్చిన తర్వాత కృష్ణవేణి కుటుంబ సభ్యులకు ఈ సమాచారం అందించారు. అంతవరకు కృష్ణవేణి బంధువులకు ఎలాంటి సమాచారం. సంఘటనా స్థలంలో పరిస్థితులు చూసిన కృష్ణవేణి కుటుంబ సభ్యులు ఆగ్రహంతో శ్రీనివాస్ పై దాడికి దిగారు. తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. భార్య ఉరివేసుకుంటుంటే కాపాడాల్సింది పోయి ప్రోత్సహించారని మండిపడ్డారు. పిల్లలు తల్లి మరణం పై పొంతనలేని మాటలు చెబుతున్నారు. ఏది ఏమైనా కట్టుకున్న భార్య ఉరివేసుకొని చనిపోతుందని తెలిసి కూడా రక్షించకుండా వీడియో చిత్రీకరించిన సైకో పైలట్ పై సర్వత్రా సమాజంలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

అన్నదాత సుఖీభవ మూడో విడత విడుదల జిల్లాలో

1.88 లక్షల రైతులకు రూ.108 కోట్లు జమ

చెరువుల పునరుద్ధరణతో సాగునీరు పెంపు

రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రభుత్వం

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



మదనపల్లి, మార్చి 13, ప్రభాతవార్త : జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి అందాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందులో భాగంగా జిల్లాలో మూడవ విడత కింద జిల్లా లో రూ.1,88,408మంది రైతులకు రూ.108 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి మాసాపేటలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ నందు ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 202526 మూడవ విడత కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం సమీపంలోని మాదాల వారి గూడెం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి లాంచనంగా ప్రారంభించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వీక్షించారు...జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లా రాయలసీమ ప్రాంతంలో కరువు జిల్లాగా ఉందని ప్రతి సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉంటుందని కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నదుల అనుసంధానం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని స్వర్ణాంధ్ర 2047లోని దాదాపు 10 సూత్రాలను ఆధారంగా ప్రాజెక్టు జలధార కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజుకు సుమారు 20 వేల నుండి 30 వేల వరకు కార్మికులు అందుబాటులో ఉండటంతో చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల శుభ్రపరిచే పనులు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టడం జరిగిందన్నారు. సాధారణంగా పెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించాలంటే వేల కోట్ల రూపాయలు, భూసేకరణ మరియు అనేక సంవత్సరాల సమయం అవసరం అవుతుందని, కానీ తక్కువ వ్యయంతో ఫీడర్ ఛానల్స్ శుభ్రపరిచే కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు.గత ఏడాది ఆగస్టు నెలలో జిల్లాలో ఉపరితల జలాలు కేవలం 3 టిఎంసీలుగా ఉండగా, ప్రస్తుతం అవి 14 టిఎంసీలకు పెరిగాయి. అంటే 11 టిఎంసీల పెరుగుదల నమోదైంది. ఒక టిఎంసీ నీటితో సుమారు 10,000 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అంచనా. ఈ లెక్కన లక్ష ఎకరాలకు పైగా సాగుకు నీరు అందే అవకాశం ఏర్పడిందన్నారు.అలాగే భూగర్భ జలాల పరంగా కూడా జిల్లాలో సుమారు 35 టిఎంసీల మేర నీటి నిల్వ పెరిగినట్లు వెల్లడించారు. ఎటువంటి కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించకుండా కేవలం ఫీడర్ ఛానల్స్ శుభ్రపరిచడం ద్వారా ఈ స్థాయి ఫలితాలు సాధించగలిగామని జిల్లా కలెక్టర్ అన్నారు.సాటిలైట్ చిత్రాల ఆధారంగా పరిశీలించినప్పుడు గత సంవత్సరం ఫిబ్రవరి చివరి నాటితో పోలిస్తే ఈ సంవత్సరం ఫిబ్రవరి చివరికి జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వంటి నీటి వనరుల విస్తీర్ణం సుమారు 11,341 ఎకరాలు పెరిగినట్లు తెలిపారు. ఇదే సమయంలో రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నదాత సుఖీభవ పథకం కింద మూడో విడతగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలను కలిపి మొత్తం 1 లక్ష 88 వేల మంది రైతులకు సుమారు రూ.108 కోట్ల ఆర్థిక సహాయం విడుదల చేయబడుతోంది. ఇందులో ఈ నియోజకవర్గానికి మాత్రమే రూ.22 కోట్ల రూపాయలు విడుదల అవుతున్నాయి. ఇప్పటివరకు మొదటి, రెండో, మూడో విడతలను కలిపి ఈ నియోజకవర్గంలోనే సుమారు రూ.75 కోట్ల సహాయం అందించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.254 కోట్ల రూపాయలు రైతులకు అందించబడినట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రాయచోటి నియోజకవర్గం లోని 39.031 మంది రైతులకు 22.27 లక్షల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. రైతు సాధికార సంస్థ అన్నమయ్య జిల్లా వారి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలను సందర్శించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం క్రింద 16నుండి 29 వరకు గాలుకుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పోస్టర్ను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్,టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ యాప్ చైర్మన్ రామ చంద ప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారి, రైతులు పాల్గొన్నారు.

దేశానికి మరింత సృజనాత్మక నాయకులు అవసరం

మొదటి పేజీ తరువాయి

హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పట్టభద్రులు తమ జీవితంలో ఎంచుకున్న రంగాల్లో నిబద్ధతతో,కష్టపడి పనిచేస్తూ విజయాలను సాధించాలని ఆకాంక్షి ంచారు.మీరు పొందిన డిగ్రీల నిజమైన విలువ మీరు మంచి మనుషులుగా,జ్ఞాన వంతమైన పౌరులుగా ఎదిగినప్పుడు మాత్రమే ఉంటుందని తెలిపారు. కవి యోగి వేమన చెప్పినట్లుగా కృషి మరియు సాధన ద్వారానే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన యూనివర్సిటీ వివిధ శాఖల ప్రొఫెసర్లు, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నారాయణ రెడ్డి

పీలేరు, మార్చి 13 ప్రభాతవార్త: పీలేరు హంద్రీనీవా యూనిట్2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వి.ఎస్. నారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీనివాస్ ఇన్చార్జిగా ఉన్నారు. నారాయణరెడ్డి కడప తహశీల్దార్ గా పని చేస్తూ పదోన్నతిపై పీలేరుకు వచ్చారు. పీలేరు అసెంబ్లీ 163 ఈఆర్వోగా కూడా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డికి స్థానిక తహశీల్దార్ శివకుమార్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

నారాయణరెడ్డిని సన్మానిస్తున్న తహశీల్దార్ శివకుమార్

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే పుత్రా కృష్ణచైతన్యరెడ్డి

కడప, మార్చి 13, ప్రభాతవార్త: అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా వల్లూరు మండలం రాగివారి కొలవల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్రా నరసింహారెడ్డి మరియు కమలాపురం శాసనసభ్యులు పుత్రా కృష్ణచైతన్యరెడ్డిలు విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని సాగుభూములను నేరుగా సందర్శించి పంటల పరిస్థితి, సాగు నీటి లభ్యతను అడిగి తెలుసుకున్నారు. అన్నదాతలకు అన్ని వేళలా అండదండగా ఉండడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనివారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు మండల నాయకులు, పార్టీ అభిమానులు, పెద్దఎత్తున కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా అతివలు రాణించాలి

ఎమ్మార్సీలో మహిళా దినోత్సవం

చౌడేపల్లి, మార్చి 13 ప్రభాతవార్త మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆకాశమే హద్దుగా రాణించాలని విద్యాశాఖాధికారులు తిరుమలమ్మ, కేశవరెడ్డిలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల విద్యాశాఖా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా విద్యాభివృద్ధికి పాటుపడ్డ భారతావనిలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు చట్టాలను మరింతగా కఠినతరం చేయాలన్నారు. ఎలాంటి సమస్యలనైనా ప్రతిఘటించే స్థాయికి ప్రతి మహిళా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయురాలు స్వరూపారాణిని ఘనంగా సత్కరించారు. ఎస్టీయు నాయకుడు లింగమూర్తి, శ్రీనివాసులు, వసంతమ్మ, సూర్యప్రకాష్, వినోద్‌కుమార్, నాగరత్నమ్మ, సుమిత్ర, స్రవంతి, కృష్ణవేణి మండలంలోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్ లైవ్ టెలికాస్ట్ ప్రోగ్రాం కెవికెలో వీక్షణ

మైదుకూరు, మార్చి 13, ప్రభాతవార్త: కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంటలో 22వ విడత పిఎం కిసాన్ మరియు మూడవ విడత అన్నదాత సుఖీభవపథకం కింద నేరుగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేసే కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా కె.వి.కె అధిపతి మరియు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం బాలకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం గౌహతి (అస్సాం) నుండి ప్రత్యక్ష ప్రసారం కావడం జరుగుతుందని దాదాపు 9 కోట్ల 32 లక్షల మంది రైతుల ఖాతాలో 18,640 కోట్ల రూపాయలు జమ చేయడం జరుగుతుందని రైతులకు తెలియజేశారు. కె.జుబేదా (డిపిడి.ఎన్ఆర్ఈజిఎస్) మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ఆరువేల రూపాయలు రైతులు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. మైదుకూరు ఏడిఏ కృష్ణమూర్తి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గం లో 34,081 మంది రైతులకు 19 కోట్ల 97 లక్షల రూపాయల మెగాచెక్కును ప్రభుత్వం ద్వారా వారి వారి ఖాతా జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీవిద్య రాణి, డాక్టర్ బి.ఎస్ కాంతి శ్రీ , ఫిరోజ్ హుస్సేన్, ఉద్యాన సహాయకులు బాల నరసింహా రెడ్డి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తిప్పనపల్లి గ్రామానికి చెందిన ప్రసాదరావుకు డాక్టరేట్ పట్టా

బద్వేలు, మార్చి 13, ప్రభాతవార్త: బద్వేల్ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి ప్రసాదరావు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. శుక్రవారం కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పట్టాభిషేక కార్యక్రమంలో ఆయనకు పొలిటికల్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగింది. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా ప్రసాదరావు డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. తిప్పనపల్లి గ్రామానికి చెందిన ప్రసాదరావు డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువలలో పూడిక తీసి భూగర్భ జలాలను పెంపొందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యం

పాలేటమ్మ చెరువు పూడికతీత మరియు కటువ మరమ్మతు పనులను ప్రారంభించిన డాక్టర్ మండిపల్లి లక్ష్మం ప్రసాద్ రెడ్డి

చిన్నమండెం మార్చి 13 ప్రభాతవార్త: శుక్రవారం రోజు ఉదయం చిన్నమండెం మండలం కేశాపురం గ్రామంలోని పాలేటమ్మ చెరువు మరమ్మత్తు పనులను ను ప్రారంభించిన మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి సోదరులు నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం ఏపీడీ మధుబాబు ఏపీఓ మురళి, టి ఏ నాగ బసయ్య, పిల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, నాగార్జున ఇరిగేషన్ ఈ సి చెంగలరాయుడు జేఈ బాబు టీడీపీ మండల అధ్యక్షులు మూగి రెడ్డెప్ప, గ్రామ అధ్యక్షులు విజయసారధి రెడ్డి, రమేష్ రెడ్డి,అమరనాధ్ రెడ్డి, నరేష్, ప్రసాద్,రాజు, చిన్నమండెం గ్రామ అధ్యక్షులు రహమతుల్లా, పడమటికోన అధ్యక్షులు శ్రీనివాసులు మండల జనరల్ సెక్రటరీ చిన్నక్రిష్ణ రెడ్డి,రవి, ఉదయ్ రెడ్డి, అమరనాధ్ రెడ్డి,కొల్లు శివ, ఆనంద్,శివ, నాగేంద్ర,రాజారెడ్డి, బోనమల గ్రామ అధ్యక్షులు రమణ రెడ్డి మరియు కలిబండ మలిరెడ్డి, రెడ్డెప్ప,రాజంపేట పార్లమెంట్ గిశిజూ జనరల్ సెక్రటరీ చింత శ్రీనివాసులు రెడ్డి , కేశాపురం గ్రామ అధ్యక్షుడు

విజయ్ కుమార్ రెడ్డి,బూత్ ఇంచార్జిలు గుడి శివ,సుదర్శన్ రెడ్డి,బర్రె వెంకట్ రమణ రెడ్డి,ఆనంద్,తెలుగు యువత నాగేంద్ర,అమరనాథ్ రెడ్డి,ప్రసాద్ ,రమణ ,రామయ్య మరియు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నందలూరు, మార్చి 13, ప్రభాతవార్త : మండలంలోని ఇసుకపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి రత్న కుమార్ విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. డివై ఈవో ఎల్. నాగయ్య చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. అనంత రం డివైఈవో నాగయ్య మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో చదువుకున్న రత్న కుమార్ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.. విద్యార్థులు ఈ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకుని రాబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. రత్నకుమార్ మాట్లాడుతూ తాను చదివిన పాఠ శాలకు తన వంతు సహాయంగా ఈ విద్యా సామగ్రిని అందజేయడం ఆనం దంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ పి. లీలాకృష్ణ ప్రదీప్, ఇసుకపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, మార్చి 13, ప్రభాతవార్త: మైదుకూరు పట్టణ కడప రోడ్డు ఎంపీడీవో ఆఫీస్ ఆవరణంలో శుక్రవారం ప్రజా దర్బార్ పిజిఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయంగా ఎమ్మెల్యే ఆఫీసు కార్యాలయాన్ని నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యాలయంలో ప్రజా సమస్యలను నేరుగా విని, వాటికి వేగవంతమైన పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ (పిజిఆర్ఎస్) నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యాలయంలో ప్రజలు అర్జీదారులను ఉద్దేశించి శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ పారదర్శక, ప్రజలకేంద్రిత పాలన కోసం అర్జీలను ఆన్‌లైన్ చేసి, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవడం. ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశం నేరుగా ప్రజా సమస్యలు తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపాలనేది ప్రధాన లక్ష్యం. ప్రజా స్వామ్యబద్ధంగా, పారదర్శక పాలనను ప్రజలకు అందించడం. నియోజకవర్గం ప్రజలు అర్జీల రూపంలో కార్యాలయానికి వచ్చిన వారికి నేరుగా ఎమ్మెల్యే ఉన్నచో మాట్లాడడం లేదా కార్యాలయ సిబ్బంది సమస్యను తెలుసుకొని అర్జీలను సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుంది. కాబట్టి ప్రజలు రెవె న్యూ, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, నీటి సదుపాయం, భూ సమస్యలు వంటి వివిధ రకాల సమస్యలపై ప్రజ ల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఇకపై ప్రజలు ప్రొద్దుటూరు కి

రావలసిన అవసరం రాదని మైదుకూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని నాతోటి ఈ ఆఫీస్ నందు సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మండల తహసిల్దార్ రాజసింహ నరేంద్ర, ఇంచార్జ్ ఎంపీడీవో నాగేం ద్ర, నియోజకవర్గ మండల అధికారులు, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్, ప్రభుత్వ ఆసు పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ యాపారాల చిన్న, రమేష్ నాయుడు, శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అర్జీదారులు పాల్గొన్నారు

పెరిగిన గ్యాస్ ధరల పై ఆందోళన

ఎడ్యుకేషన్ మార్స్ 13 ప్రభాతవార్త : పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం వంట గ్యాస్ ధరల పెరుగుదల పై ఎస్సీ సంక్షేమ సంఘం, పిఎస్ఎఫ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.యన్. రాజా, పిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొడవటిగంటి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పైయింటి సునీల్ కుమార్, ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మున్నిల్లి కనకరాజు మాట్లాడుతూ వంట గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు వరుసగా పెరుగుతూ సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం మోపుతున్నాయని వారు తెలిపారు. ఇప్పటికే కూరగాయలు, విద్యుత్, విద్య, వైద్య ఖర్చులు భారీగా పెరిగిన పరిస్థితిలో గ్యాస్ ధరలు పెరగడం వల్ల కుటుంబాల నెలవారీ ఖర్చులు అధికమవుతున్నాయని పేర్కొన్నారు.అంతర్జాతీయ మార్కెట్ల పరిస్థితులను కారణంగా చూపుతూ గ్యాస్ ధరలను పెంచడం సరైన చర్య కాదని, ప్రజల జీవన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే వంట గ్యాస్ ధరలను తగ్గించి, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సబ్సిడీ పెంచాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలపై పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

వైవియు నుంచి గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని హేమ ప్రియా

కడప ఎడ్యుకేషన్ మార్చి 13,ప్రభాతవార్త కడప నగరానికి చెందిన విద్యార్థిని పిల్లకత్తువు. హేమ ప్రియా డిగ్రీ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి గోల్డ్ మెడల్ అందుకుంది. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో చదువుకున్న హేమ ప్రియా, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం విభాగాల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకుంది. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ఈ గోల్డ్ మెడల్‌ను ఆమెకు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయం తరపున"గుట్టి రెడ్డి పాలిరెడ్డి గోల్డ్ మెడల్" అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.హేమ ప్రియా తండ్రి శివ యాదవ్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి శాంతి గృహిణి. ప్రస్తుతం వారి కుటుంబం కడపలో నివసిస్తోంది. సాధారణ కుటుంబానికి చెందిన హేమ ప్రియా కష్టపడి చదివి విశ్వవిద్యాలయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులకు కూడా ఆనందాన్ని కలిగించింది. ఆమె సాధించిన ఈ విజయంపై కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

జ్ఞాన దీప్తి విద్యార్థుల ప్రతిభ

నందలూరు, మార్చి 13 ప్రభాతవార్త : జాతీయ స్థాయి ఒలింపియాడ్ (ఐఐటి) పోటీ పరీక్షల్లో స్థానిక జ్ఞాన దీప్తి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ అద్దంకి జానకినాథ్, ప్రధానోపాధ్యాయురాలు నిడిగంటి లక్ష్మమ్మ తెలిపారు. జనవరి 25న కడప జిల్లా బాలవికాస్ పాఠశాలలో నిర్వహించిన ఒలింపియాడ్ (నీట్, జేఈఈ మెయిన్స్) పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. మ్యాథ్స్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ తరగతి విద్యార్థి పంతగాని నాని 2వ ర్యాంకు సాధించగా, 4వ తరగతి విద్యార్థులు బి. లక్ష్మీ సుశాంత్, కొట్టే ధనుష్‌లు 3వ ర్యాంకులు సాధించారు. జాతీయ సైన్స్ విభాగంలో 5వ తరగతి విద్యార్థులు పల్లపోతుల శ్రీజ, మన్నెం లాస్య 3వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి మ్యాథమెటిక్స్ విభాగంలో 5వ తరగతి విద్యార్థులు పసుపులేటి నందికా రెడ్డి, ఐ. చరిత 2వ ర్యాంకులు సాధించగా, రాష్ట్ర స్థాయి సైన్స్ విభాగంలో 3వ తరగతి విద్యార్థులు యు. లక్ష్మీ ఆరాధ్యం 3వ ర్యాంకు, ఎస్. సుబ్రహ్మణ్యం 2వ ర్యాంకు, 4వ తరగతి విద్యార్థిని పల్లపోతుల వైష్ణవి 2వ ర్యాంకు సాధించారు. ఒలింపియాడ్ పోటీల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముశ్రత్, రాజి, మీనా, కే. వెంకటరమణ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె రైతుల ఖాతాలో రూ 5.38 కోట్ల నిధులు జమ



తంబళ్లపల్లె మార్చి 13 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా తంబళ్లపల్లె మం డలంలోని 8973 మంది రైతులకు రూ 5.38. 38 000 కోట్ల నిధులు రైతుల ఖాతాలకు జమ జరిగినట్లు సురేష్, రెడ్డిశేఖర్, నవ జ్యోష్ణలు తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లె సచివాలయంలో రైతులతో జరిగిన సమీక్షలో వారు అన్నదాత సుఖీభవ ద్వారా రూ 3.58.92000 కోట్లు పీఎం కిసాన్ ద్వారా రూ 1.79.46000 కోట్లు మొత్తం రూ 5.38. 38000 కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన ఈ నిధుల లబ్ధిదారుల పేర్లను గ్రామ సభకు వివరించారు. అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో పడని రైతులు తమ సమస్యలను వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వీడియో ద్వారా రైతులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పెద్దేరు ప్రాజెక్ట్ చైర్మన్ కొటాల శివకుమార్, పురుషోత్తం, మాజీ జెడ్పిటిసి రామచంద్ర,తెలుగు యువత ఉపాధ్యక్షుడు నరసింహులు, చెరువు సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, బాలకృష్ణారెడ్డి, కాలా నారాయణ, సామిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్, బురుజు వెంకటరమణ, వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు, రామాంజులు, డి ఎ సోమశేఖర్ రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

రోటరీ ప్రజా వైద్యశాల ప్రారంభం

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 13 ప్రభాతవార్త రోటరీ 3160 డిస్ట్రిక్ గవర్నర్ ఎం.కె. రవీంద్ర శుక్రవారం స్థానిక గాంధీ రోడ్డు లోని శాతవాహన ఇన్స్టిట్యూట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మీ కోసం రోటరీ ప్రజా వైద్యశాలను ఆయన స్థానిక వైద్యులు రంగారెడ్డి, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, కళావతి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు గత 121 సంవత్సరాల నుండి రోటరీ క్లబ్ ప్రజా సేవలో వుంటూ విద్యా, వైద్య రంగాల, పర్యావరణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నామని, అనంతరం డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రజా వైద్యశాల ప్రారంభోత్సవం దాదాపు గత 2 సంవత్సరాల నుండి సంస్థాపకులు మాకం సురేష్ బాబు ఆలోచన అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు వైద్యం ఖరీదైన తరుణంలో ఈ ప్రజా వైద్యశాల ఎంతో ప్రయోజనకరమని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు అలాగే రాజుపాలెం మరియు ప్రొద్దుటూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులకు సేవే ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘు రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష, రోటరీ 3160 డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ సాధు గోపాలకృష్ణ, రొటేరియన్లు రామలింగారెడ్డి, బేపారి జాకీర్ అహ్మద్, అవ్వారు తాండవకృష్ణ, బాల సూర్యా రావు, మాజీ ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ భారతి, సభ్యులు ఉషారాణి, జ్యోతి, కళ్యాణి, మణిశయన తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ బంద్‌ను అడ్డుకున్న పోలీసులు

విద్యార్థి నాయకులను వైవీయూ ప్రధాన ద్వారం వద్ద అడ్డుకున్న పోలీసులు
కాన్వకేషన్ బయట ప్రాంతంలో నిర్వహించడం సిగ్గుచేటు
ఆర్ఎస్ఎఫ్, వైవీయూ పరిరక్షణ కమిటీ

పెండ్లిమర్రి, మార్చి 13, ప్రభాతవార్త: వైవీయూ అధికారుల అసమర్థతతోనే వైవవీయూలో నిర్వహించాల్సిన స్నాతకోత్సవాన్ని ప్రైవేటు కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నారని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేసు యాదవ్, వైవీయూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ అమృత్ కుమార్, కోకన్వీనర్ భరత్ సింహ అన్నారు. వైవీయూలో శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడైనా చదువుకున్న వారికి డిగ్రీలు ప్రదానం చేస్తారు. కానీ కడప వైవీయూలో ప్రైవేటు ప్రాంతాల్లో నిర్వహించడం వైవీయూ అధికారుల అసమర్థతన్నారు. ఇకపై విద్యార్థులను అన్ని విషయాల్లో చైతన్యపరుస్తూ వైవీయూ అభివృద్ధి కోసం కీలకమైన ఉద్యమాలు నిర్మిస్తామని విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె మండలంలో 5479మందికి అన్నదాత నిధులు విడుదల

నిమ్మనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త : నిమ్మనపల్లె మండలంలోని పది గ్రామ పంచాయితీల్లో 153గ్రామాల్లోని 5479మంది రైతులకు రూ.3.08కోట్లు అన్నదాత సుఖీభవ నిధులు శుక్రవారం విడుదల అయినట్లు ఏఓ మంజుల తెలిపారు. వీటిలో రూ.2.19కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కాగా రూ.89లక్షలు కేంద్ర ప్రభుత్వ నిధులు అన్నారు. ఈ విడుదల నిధులు శుక్రవారం వారి వారి ఖాతాల్లో జమ అయినట్లు ఆమె తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కలికిరి, మార్చి 13, ప్రభాతవార్త: రక్తదానం ప్రాణదానంతో సమానమని జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాలలో శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.కె.అపర్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రక్తదానం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమణారెడ్డి, ప్రొఫెసర్ రంగజనార్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.అపర్ణ, ఐఆర్‌సీఎస్ డా.జగదీష్, ఎస్.వీ మహేష్‌బాబు, టెక్నికల్ సూపర్‌వైజర్, అధ్యాపకులు, వాలెంటీరులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు

డిఈఓ సుబ్రహ్మణ్యం

మదనపల్లె క్రైమ్ మార్చి 13 ప్రభాతవార్త. జిల్లాలో మార్చి 16వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఇఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం డి ఈ ఓ విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టిందన్నారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 22,149 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. వీరి కోసం జిల్లాలో 124 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 21,526 మందిలో బాలురు 10,598 కాగా, బాలికలు 10,928 మంది, ప్రైవేట్ మొత్తం 623 మంది (బాలురు 414, బాలికలు 209) పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, వెలుతురు వంటి కనీస సౌకర్యాలను కల్పించామన్నారు. పరీక్షల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్ల నిఘా ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఇన్విజిలేటర్లకు ఏవైనా సందేహాలు, ఫిర్యాదులున్నా సంప్రదించడానికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 910040686ను సంప్రదించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్లు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆకాంక్షించారు.

మాట ఇచ్చాను ప్రహరీగోడను నిర్మిస్తున్నాము : గువ్వల

చౌడేపల్లి, మార్చి 13 ప్రభాతవార్త పాఠశాలకు చుట్టూ ప్రహరీగోడ నిర్మిస్తామని మాట ఇచ్చామనీ, నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నామని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం కాగతి ప్రాథమికోన్నత పాఠశాలలో నెల రోజుల క్రితం క్షుద్రపూజల కలకలం రేకెత్తించింది. ఈక్రమంలో విద్యార్థి మృతి చెందడంతో పిల్లలు బడికి రాకుండా పోవడంతో జనవిజ్ఞాన వేదికను ఏర్పాటు చేసారు. పాఠశాల చుట్టూ ప్రహరీగోడను ఏర్పాటు చేయాలని అప్పట్లో విద్యార్థులు, వారితల్లిదండ్రులు గువ్వల రమేష్‌రెడ్డిని కోరారు. దీంతో ఆయన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చల్లాబాబు, జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి రూ. 15లక్షలతో ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు తెచ్చారు. ఈమేరకు పాఠశాల ఆవరణంలో భూమి పూజ చేసారు. విద్యకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన వివరించారు. అడిగిన వెంటనే సమస్యను పరిష్కరించిన నాయకులు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. తేదేపా నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్తను నిర్లక్ష్యం చేయొద్దు : గఫూర్

చౌడేపల్లి, మార్చి 13 ప్రభాతవార్త ప్రజారోగ్యాన్ని పాడు చేసే చెత్తపై నిర్లక్ష్యం చేయొద్దని డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ అన్నారు. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ పరిధిలోని చెత్తసేకరణా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సచివాలయంలో పంచాయతీ అధికారులు, గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం ఏర్పాటు చేసారు. ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా తడి, పొడి చెత్తలను సేకరించి షెడ్లకు తరలించాలన్నారు. అక్కడ వర్మికంపోస్టు ఎరువును తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవలన్నారు. అనంతరం పారిశుద్ధ్యపై గ్రామాల వారీగా చర్చించారు. పంచాయతీ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కు పంపిణీ

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త:
గత కొంతకాలంగా అన్నదాతలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అన్నదాత సుఖీభవ నిధులు రాష్ట్రంలోని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మరోసారి భారీ పెట్టుబడి సహాయం కింద రైతులకు అందించారు. అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజవర్గ శాసనసభ్యులు కిషోర్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది కానుకగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం మూడో విడత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 6వేల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే రెండు విడతల్లో పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 4వేలు, కూటమి ప్రభుత్వం 10వేలు మొత్తం కలిపి ప్రతి రైతు ఖాతాలో 14 వేలు అందించాయని, మూడో విడతలో 6వేల రూపాయలు మొత్తం కలిపి ఏడాదికి 20 వేల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు మండల, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, అనుబంధ సంఘాలు మండల శాఖ అధికారులు రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

తొండూరు కాంబల్లి వంతెన పనుల పరిశీలన

తొండూరు మార్చి 13 ప్రభాతవార్త:

తొండూరు నుంచి కాంబల్లి గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యతను తనిఖీ చేసి, నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల రవాణా సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వంతెన నిర్మాణాన్ని నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బ్రిడ్జి పూర్తయితే కాంబల్లి గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి రవాణా కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు పలువురు ముఖ్య నాయకులు బూచుపల్లి రమణరెడ్డి, మైసూరారెడ్డి, కొమ్మా శివశంకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఓబుళరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మల్లెల శీను, రామాపురం మహేశ్వర్‌రెడ్డి వీరితో పాటు సంబంధిత శాఖల అధికారులు మరియు స్థానిక నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

డెంగ్యూ మలేరియాపై అవగాహన

తొండూరు మార్చి 13 ప్రభాతవార్త:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సుభాషిని ఆధ్వర్యంలో హెచ్.పి.వి టీకా గురించి బాలికలకు అవగాహనా కలిస్తూ 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపు బాలికలు తప్పనిసరిగా హెచ్.పి.వి టీకా వేయించు కోవాలని హెచ్.పి.వి టీకా వేయించుకోవడం వలన మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖ ద్వారా వచ్చే క్యాన్సర్ రాకుండా నివారించేందుకు ఈ టీకా ఉపయోగపడుతుందని తెలియజేస్తూ, ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేశారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ఫ్రైడేడ్రైడే సందర్భంగా డివిజన్‌లో ప్రతి సచివాలయంలో నిర్వహిస్తున్నారు అని, ఇంటింటికి వెళ్లి ఫివర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నారు అని సిద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య సి.హెచ్.ఓ. విజయ ల్యాబ్ టెక్నీషియన్ కుమారి పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

పెద్దమండెం మార్చి 13 ప్రభాతవార్త
ఎఫ్ఈఎస్ ఆధ్వర్యంలో 17 పంచాయతీలలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పరసతోపులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ రావు ఏపీవో సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల్లో మహిళా సంఘాలు ఏర్పడి వారు ఆర్థికంగా ఎలా ఎదగాలి వారి భవిష్యత్తు వారి పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలి అనే దానిపై మహిళల్లో సంఘాల్లో చర్చలు జరిగాయి వీటి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ ప్రజాసేవకు అంకితం కావాలని ఫెడరేషన్ మెంబర్స్ యుపీఎస్ మెంబర్స్ అవగాహన కల్పించారు. మహిళలు ప్రభుత్వం అందించే పథకాలు వారి సహకారం చేయూతలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్లుగాను వార్డు మెంబర్లు గాను ఎదిగి ప్రజల సేవకు అంకితం కావాలని అన్నారు అలాగే మహిళలు గ్రామాల్లో జరిగే బాల్య వివాహాలను అరికట్టాలని మహిళల సమస్యలకు తోడ్పాటు చేయూతనందించి పరిష్కరించాలని మహిళా సంఘాలు తీర్మానించుకున్నాయి. ఇలా ప్రతి మహిళలు ఆలోచించి తమ భవిష్యత్తు కార్యచరణ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలను నిర్వహించారు.

హెచ్‌పివి వ్యాక్షిన్‌తో బాలికలకు పరిపూర్ణమైన ఆరోగ్యం

రామసముద్రం మార్చి 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ డాక్టర్ ప్రత్యూష, పృథ్వి రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మహిళల్లో వచ్చే గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్‌ను నివారించేందుకు ప్రతి ఒక్కమహిళ తప్పకుండా హెచ్‌పివి టీకా వ్యాక్సినేషన్ వేయించుకోవాలని డాక్టర్ ప్రత్యూష, పృథ్వి రాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న వారు తప్ప కుండా హెచ్‌పివి టీకా వ్యాక్సినేషన్ వేయించికోవాలని, చిన్న వయస్సులోనే ఈటీకా వేయించడం వల్ల భవిష్యత్‌లో క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని, అర్హులైన ప్రతి బాలిక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాక్సినేషన్ అనంతరం ప్రతి మహిళకు సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు ప్రత్యూష, పృధ్విరాజ్,హెల్త్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషన్ వైద్య సిబ్బంది,ఏ ఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పీలేరు, మార్చి 13 ప్రభాతవార్త:
స్థానిక కోర్టు ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శుక్రవారం జడ్జి మాట్లాడుతూ జాతీ అదాలత్ లో రెండు బెంచ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి బెంచ్లోలో మోటారు వాహనాల కేసులు, సివిల్స్ కేసులు. బీసీఎన్ఎల్, బ్యాంకు కేసులు. రెండో బెంచ్లో క్రిమినల్. సివిల్, కుటుంబ తాగాదాలు, ఎన్ఐ యాక్టు. ఎక్సైజ్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

ఆర్బిట్ ద్వారా అధ్యాధునిక డయాగ్నస్టిక్ సేవలు

ప్రొద్దుటూరు మార్చి 13 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణంలో అందరికీ అందుబాటులో ఆర్బిట్ సంస్థ వారు అత్యాధునిక డయాగ్నస్టిక్ సేవలు ప్రారంభించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆర్బిట్ దయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బిట్ దయాగ్నోస్టిక్ సెంటర్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అధునాతన పరికరాలతో అన్ని దయాగ్నోస్టిక్ సేవలకు ఇది వన్ స్టాఫ్ సొల్యూషన్ అని వివరించారు. కార్యక్రమంలో రేడియాలజిస్టులు డాక్టర్ కె.ఎస్. వినయ్, డాక్టర్ జుఫికర్ అలీ, పాథాలజిస్ట్ డాక్టర్ మధుసూదన్, నిర్వాహకులు రాజశేఖర్, సుధాకర్, చిరంజీవ కుమార్, పుల్లారెడ్డి, సిబ్బంది శ్రావణి, పార్వతి, ల్యాబ్ టెక్నీషియన్లు నాగరాజు, షారూఖ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకోవాలి.

కురబలకోట మార్చి 13 ప్రభాతవార్త.

తెలుగు తొలి కవయిత్రి మొల్లను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలం లో అంగళ్లలో మొల్ల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరళమైన భాషలో వెనుకబడిన వర్గాల నుండి కవయిత్రిగా రామాయణం రచించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచిన శివ భక్తురాలు మొల్లను ఆదర్శంగా తీసుకోవాల కవయిత్రి ముళ్ళ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షులు సాయి లోకేష్ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రెడ్డి నరేంద్ర కుమార్ రెడ్డి, గోల్డెన్ వాలీ రమణారెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఓసూరి కిరణ్ కుమార్, కురబలకోట మండల నాయకులు తిరుమల పాల డైరీ కరుణాకర్ రెడ్డి,ఆటో రాజా, ఆటో రాజా, గుణశేఖర, టిడిపి నాయకులు శెట్టి సీతా రాంబాబు, బిజెపి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేస్తాం

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త:

నియోజకవర్గ పరిధిలోని కలికిరి మండలం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నల్లారి కుటుంబ సభ్యుల అభిమానంతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని కలికిరి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సిద్దయ్య చారి, రమేష్ బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస వర్మ, రాంబాబులు తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాలతో ఇప్పటికే గణనీయంగా ప్రజాభిమానం పొంది ప్రజలు శాసన సభ్యులతో కలిసిమెలిసి తిరుగుతున్నారని అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పార్టీలో సముచిత స్థానం కల్పించడం నల్లారి కుటుంబానికి చెందుతుందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు అనునిత్యం పార్టీకి శాసనసభ్యుల ఆదేశాలతో అనుగుణంగా పనిచేస్తామని వారు తెలిపారు.

యువకుడు మృతి

మదనపల్లె క్రైమ్ మార్చి 13 ప్రభాతవార్త.
వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు, తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు మండలం దేవలచెరువు గ్రామం నీరుగట్టుపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు అనిల్ కుమార్ (30) బుధవారం రాత్రి తన నివాసంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ గురువారం మృతి చెందాడు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

మదనపల్లె క్రైమ్ మార్చి 13 ప్రభాతవార్త.
జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఆ సంస్థ రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్ కవరకుంట్ల జయరాజ్ తెలిపారు. శనివారం మదనపల్లెలో మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ సౌకర్యం, పిల్లలకు ఉచిత విద్య వంటి హక్కుల సాధన కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ పోరాడుతోందన్నారు. సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో భాగంగా, మార్చి 31వ తేదీన మదనపల్లె పట్టణంలో జిల్లా మొదటి మహాసభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభకు మంత్రులు, శాసనసభ్యులు మరియు ప్రతిపక్ష నేతలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

లక్కిరెడ్డిపల్లి: మార్చి 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న 33 మంది పదవ తరగతి విద్యార్థులకు రెడ్డివారిపల్లెలో ఎస్జిటి ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గోటూరు శ్రీనివాసులు పరీక్ష సామాగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి 1 చక్రే నాయక్, ఎంఈఓ 2 వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు. పరీక్షా సామాగ్రి ఎంఈవో1 చక్రే నాయక్, ఎంఈవో 2 వెంకట సుబ్బయ్య ల చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో 1 చక్రే నాయక్ మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన ప్రీ ఫైనల్ పరీక్షలలో మొత్తం 33 మంది విద్యార్థులు గాను 13 మంది విద్యార్థులు 500 మార్కులు పై బడి సాధించారన్నారు. అలాగే ఈనెల 16వ తేదీ నుంచి జరగబోయే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి రైటింగ్ ప్యాడ్స్, పెన్స్, పెన్సిల్, మెండర్, వితరణ చేసిన ఉపాధ్యాయుడు గోటూరు శ్రీనివాసులును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవి, సిఆర్ఎంటి రామ్మోహన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎం జ్యోతికి గోల్డ్ మెడల్

లక్కిరెడ్డిపల్లి మార్చి 13 ప్రభాతవార్త

శుక్రవారం యోగివేమన వర్సిటీ 14వ కాన్వకేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. మెరిట్ సాధించిన విద్యార్థులకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా అవార్డులు అందజేశారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎం వెంకటరమణ కుమార్తె ఎం జ్యోతి యోగివేమన యూనివర్సిటీ నందు ఎంఎస్సీ పీజీలో మెటీరియల్ సైన్స్ నాన్ టెక్నాలజీ విభాగంలో కాలేజీ టాపర్గా నిలిచిన ఎం జ్యోతి కి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందించారు. వారి తల్లిదండ్రులను గవర్నర్ అభినందించారు.

మొల్ల జయంతి సందర్భంగా నివాళులు

గోపవరం. మార్చి 12. ప్రభాతవార్త.

కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి సందర్భంగా గోపవరం మండలంలోని హరిత హోటల్ దగ్గర ఏర్పాటు చేసిన ఆమె విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మాట్లాడుతూ రామాయణం మొల్ల రామాయణం రాసినటువంటి కవయిత్రి మొల్ల మన గోపవరంలో జన్మించడం అనేది ఎంతో సంతోషకర చెప్పడం జరిగింది. మొల్ల జన్మించిన యొక్క గోపవరం గ్రామంలో భవిష్యత్తులో ఇక్కడ భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఈ యొక్క కోనేటిని శుద్ధి చేసి భవిష్యత్తులో దీన్ని మనం అందరం పునర్నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది

ఇంటి పన్నులు త్వరగా చెల్లించండి..

లక్కిరెడ్డిపల్లి మార్చి 13 ప్రభాతవార్త
గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని ఎంపీడీవో రెడ్డయ్య సూచించారు. శనివారం లక్కిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను చెల్లించని ఇల్లు అపార్ట్మెంట్ లు ప్రైవేట్ స్కూల్ యజమానుల వద్దకు వెళ్ళి ఇంటి పన్ను ఆన్ లైన్ ద్వారా ఎలా చెల్లింపులు చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా ఎంపీడీవో రెడ్డయ్య మాట్లాడుతూ పన్ను చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఇంటి పన్ను వసూళ్ల చేయాలని ఇంటి పన్ను చెల్లించని యజమానులకు నోటీసులు జారీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి బూడిగుంటపల్లి పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్ పంచాయతి సెక్రటరీ నర్సింహులు పంచాయతీ సిబ్బంది హరీష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోండి

బద్వేల్ మార్చి 13, ప్రభాతవార్త:

ఎండలు రోజు రోజుకు పెరుగుతున్నందున అందుకు తగ్గట్టు జాగ్రత్తలను పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నర్సింహారెడ్డి అన్నారు. బద్వేల్ మండలం అనంతరాజుపురంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది లార్వా ,ఫీవర్, ఇంటింటి సర్వే నిర్వహించారు. లార్వా గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎండలలో తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. మజ్జిగ టెంకాయ నీళ్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను త్రాగాలన్నారు. అలాగే దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, తదితర విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. త్రాగునీరు కలుషితం కాకుండా ఎక్కువ పైపులైన్ పై దృష్టి పెట్టమన్నారు .పైపు లీక్ అయినచోట్ల పై అధికారుల దృష్టికి తీసుకుపోయి, యుద్ధ ప్రాతికపదిన మరమ్మతులు చేస్తున్నామన్నారు. ప్రజల వద్దకే వైద్యం అందుతుందని, 104, 108, విలేజ్ హెల్త్ క్లినిక్లు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సిహెచ్ఓ శిరీష, వైద్య సిబ్బంది లక్ష్మీనారాయణమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అల్లంఅశోక్ కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం

నందలూరు, మార్చి 13, ప్రభాతవార్త:

విద్యా, సాహిత్య, నాటకరంగం, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న గణిత ఉపాధ్యాయులు అల్లం అశోక్ కుమార్‌కు స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ అసోసియేషన్ ఉత్తమ సేవా పురస్కారం" ప్రదానం చేశారు. నందలూరు రైల్వే కేంద్రంలోని కళాక్షేత్రంలో నిర్వహించిన సంస్థ 27వ వార్షికోత్సవ కార్యక్రమంలో అశోక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేపగుంట సామ్రాజ్, శ్రీమతి సునీత, అభిషేక్, శ్రీమతి వలిమి రాధ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

సిద్ధవటం, మార్చి 13 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు కుటుంబాలకు భరోసాగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టి రైతు కుటుంబాలను ఆదుకున్నారని సింగల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు తెలిపారు మండల కేంద్రమైన సిద్దోటంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బ్యాంక్ ఆవరణంలో అస్సాం లోని గౌహతి నగరంలో 22వ పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాలోకి జమ చేసే విశ్లేషణ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటూ కేంద్ర ప్రభుత్వం 2 వేలు, రూ, రాష్ట్ర ప్రభుత్వం, 4 వేలు రూ రైతులకు అకౌంట్లోకి లక్షల 6000 జమ చేసి రైతు కుటుంబాలను ఆదుకుంటున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్‌డిఎల్‌సిఓ శ్రీధర్ శ్రీనివాసు, టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్, మాజీ మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి సీఈవో సుకూర్ భాష రైతులు పాల్గొన్నారు. టకోలి రైతు సేవ కేంద్రంలో రైతులకు అన్నదాత సుఖీభవ రైతుల ఖాతాలో నిధులు జమ చేయడమైనది ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి వార్డ్ మెంబర్ ఓబుల్ రెడ్డి శంకర్ రెడ్డి కాజీపేట జగన్ మోహన్ రెడ్డి చిన్నపరెడ్డి రైతులు పాల్గొన్నారు.

మాధవరంలో వరుస దొంగతనాలు

సిద్ధవటం మార్చి 13 ప్రభాతవార్త

చోరీలతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురై పోతున్నారు వరుస చోరీలతో మాధవరం గ్రామంలో నివాసమున్న గృహ నివాసులు భయభ్రాంతులకు గురై పోతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ చేపడుతున్న చోరీలు జరగడంపై కలకలం రేపుతున్నాయి. మండలంలోని మాధవరం గ్రామం లోని, కడప చెన్నై జాతీయ రహదారి లక్ష్మీపురంలో నివాసమున్న రాజేశ్వరి అనే మహిళ తన పిల్లలతో కలిసి రైల్వే కోడూరు కు గురువారం ఉదయం వెళ్లి తిరిగి శుక్రవారం ఉదయం వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు తనగృహంలో బీరువాలో దాచుకున్న 1 జత బంగారు కమ్మలు, 2 వెండి గొలుసులు 8 వేలు రూ, నగదు చోరీకి పాల్పడ్డారని పుట్టింటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి చోరీ చేశారని రాత్రి వేళలో పోలీసులు గస్తీ చేస్తున్న మాధవరం లో చోరీలు జరగడంపై ప్రజలు భయభ్రాంతులకు గురైపోతున్నారు జరిగిన చోరీపై సిద్ధవటం మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, హెడ్ కానిస్టేబుల్ అంజినాయక్ విచారిస్తున్నారు.

జర్నలిజంలో అమ్మాయికి గోల్డ్ మెడల్

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 13 ప్రభాతవార్త

వైవియూ నిర్వహిస్తోన్న స్నాతకోత్సవంలో ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌కి చెందిన షేక్ రేష్మా గవర్నర్ చేతులు మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. షేక్ రేష్మ 2019, 21వసంవత్సరంలో జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ పూర్తిచేసి టాపర్గా నిలిచారు. సాధారణ గృహిణిగా తన తల్లి పడిన కష్టానికి ఈ గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉన్నదని రేష్మ కుటుంబసభ్యులు అన్నారు.

పిఎం విశ్వకర్మ ట్రేడ్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంటు అండ్ ఫెసిలిటస్ట్రన్ ఆఫీస్ విశాఖపట్టణం ఆధవర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం(డిఐసి) డిఆర్‌డిఏ, మెప్మా అన్నమయ్య జిల్లా సహకారంతో మదనపల్లెలో నిర్వహిస్తున్న పిఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ కమ్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ మదుసూదన్‌రావు ప్రారంభించారు. పట్టణంలో శుక్రవారం సిటిఎం రోడ్డులోని పద్మావతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసి ఎగ్జిబీషన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి కళాకారుల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిఎం విశ్వకర్మ పథకంచే సాంప్రదాయ వృత్తుల కళాకారులకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందుతుందని తెలిపారు. మార్చి 13నుంచి 15వరకు మూడురోజులు పాటు ఉదయం 10గంటలనుంచి రాత్రి 8గంటల వరకు ఈ ఎగ్జిబీషన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంల మురళీమోహన్, డైరెక్టర్ ఏపి ఎంఎస్ఎంఈడిసి ప్రాజెక్టు డైరెక్టర్ మెప్మా పి.లక్ష్మిదేవి, పీడి డిఆర్‌డిఏ నాగేశ్వరావు, ఆర్ సంజయ్‌కుమార్, జేడి ఎంఎస్ఎంఈ డిఎఫ్ఓ విశాఖపట్టం ఎల్డిఎం ఆంజినేయులు, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, రాటకొండ గురు ప్రసాద్, సీనియన్ మేనేజర్ ఐపిపిబి, విజయవిహారి, డిప్యూటి డెవలప్‌మెంటు మేనేజర్ నాబార్డ్, తదితరులు పాల్గొన్నారు.

125 రోజులు పని దినాలు కల్పించడమే లక్ష్యం

పెద్దమండెం మార్చి 13 ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 125 రోజులు పని దినాలు కల్పించడమే లక్ష్యంగా వి వి జి రాంజీ పథకాన్ని చేపట్టిందని ఏపీవో సురేంద్రనాథ్ రెడ్డి అన్నారు శుక్రవారం మండలంలోని కూలీలతో సమావేశం నిర్వహించి 125 రోజులు పని దినాలు కల్పించడమే అచ్చంగా అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కూలీలకు ఆలస్యం లేకుండా వేతనాన్ని వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు అలాగే ఆలస్యమైన పాయింట్ ఫైవ్ పర్సెంట్‌తో అధికంగా వేతనం చెల్లించడం జరుగుతుంది అన్నారు. ఫిబ్రవరి 28 నుండి మార్చి 28 వరకు 125 రోజుల వందనాలపై గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డి సాంకేతిక సహాయకులు వెంకటరమణ పురుషోత్తం రెడ్డి సునీల్ విజయ్ కుమార్ నాగరాజు ఎఫ్సీఎస్ సిబ్బంది అమీర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు వాసి డాక్యుమెంటరీకి గద్దర్ అవార్డు

ప్రొద్దుటూరు మార్చి 13 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయితీ కి చెందిన ఎంపిటీసి బూసం రవీంద్రనాథ్ నిర్మాతగా వ్యవహరించిన వనజీవి రామయ్య చిత్రానికి తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డు ప్రకటించిందని శుక్రవారం ఆయన మీడియాకు తెలిపారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ తాను చిత్రసీమలో ప్రవేశించిన తొలి ప్రయత్నానికే అవార్డు రావడం ఆనందకరమన్నారు. ఈ అవార్డు తనకు నూతన ఉత్సాహాన్ని అందించిందని వివరించారు. ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తాను 2022వ సంవత్సరంలో త్రిష అనే తెలుగు మూవీ సుమన్ హీరోగా నిర్మించగా, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సినిమా పూర్తి కాలేదని, తర్వాత మహాశివరాత్రి సందర్భంగా అంతా నీ దయ శంకర అనే శివుడి పాట చేశామని వివరించారు. వనజీవి రామయ్య అనే ఖమ్మం జిల్లాకు సంబంధించి కోటిన్నర మొక్కలు నాటిన రామయ్య బయోగ్రఫీ తీయడం జరిగిందని, ఆయనకు 2017 పద్మశ్రీ అవార్డు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని, గత సంవత్సరం ఏప్రిల్ లో ఆయన మరణించడం జరిగిందని వివరించారు. ఈ నెల 19వ తేదీ ఉగాది పర్వదినం రోజున తాను హైదరాబాద్‌లో ఈ అవార్డు అందుకుంటునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు వాసి నిర్మించిన చిత్రానికి గద్దర్ అవార్డు రావడం సంతోషకరమని పలువురు ప్రశంసించారు.

సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్ట్ చేయాలి

బద్వేలు, మార్చి 13, ప్రభాతవార్త

పట్టణంలో చెరువులు, వాగులు, కల్వర్ట్‌లను ఆక్రమించి ఇళ్లు నిర్మించడాన్ని ఖండిస్తూ, అలాంటి భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయల విలువ చేసే కల్వర్ట్‌లు, చెరువులపై ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది మున్సిపల్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎలాంటి భూములనైనా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విమర్శించారు. భగత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు హక్కు పత్రాలు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన పెద్ద చెరువులోని తామర మడుగును ఆక్రమించి సాగు చేస్తున్నారని, అక్రమాలకు గురైన చెరువులు, వాగులు, కుంటలు, కల్వర్ట్‌లు, డీకేటీ ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు కె. జకరయ్య, బి. అనిల్ కుమార్, ఏరియా కమిటీ సభ్యులు బాబు, విజయరావు, చంద్రపాల్, జయరామరాజు, పట్టణ కమిటీ సభ్యులు చిట్టిబాబు, గుర్రప్ప, శంసున్, బాషా, రంతుబాషా తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

బద్వేల్ అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త :

అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌ఖి పథకంలో భాగంగా నేడు 3వ విడత కింద రూ.6,000/ లను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీ ప్రకారం ప్రతి ఏటా రూ.20,000/ ఆర్థిక సాయం అందిస్తూ, అన్నదాత కుటుంబాల్లో ఉగాది వెలుగులు నింపుతున్నామని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు అన్నారు, 2025, 26 ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల్లో కలిపి మొత్తం రూ.8,985.41 కోట్లను విడుదల చేసి రైతులకు అండగా నిలిచాం. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే సంకల్పంతో మా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని వారు అన్నారు.

పూదోటలో మల్లెపువ్వు మొల్లమాంబ

వేంపల్లె:మార్చి 13 ప్రభాతవార్త

తెలుగు సాహితీ పూదోటలో విరిసిన మల్లెపువ్వు మహాకవయిత్రి, మహాసాధ్వి మొల్లమాంబ అని ఏపిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం మొల్లమాంబ 586 జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ రామాయణం ఒక ఆదర్శ కావ్యమని, ఆదికవి వాల్మీకి తన రామాయణ కావ్యం ద్వారా 24 వేల శ్లోకాలతో సమాజానికి తెలియపరిచారన్నారు. ఆ మహా కావ్యాన్ని కేవలం 871 గద్య పద్యాలతో, అలతి అలతి, తెట తెలుగు, కడప మాండలిక పదాలతో ఆంధ్రీకరించి తెలుగు జాతికి మొల్లమాంబ అంకితం చేశారన్నారు. స్త్రీ జాతికి వన్నె తెచ్చిన మల్లెపువు కవయిత్రి మొల్లమాంబ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, నాయకులు రామకృష్ణ, అమర్, ఉత్తన్న, వెంకటేష్, వేమారాజా, శేఖర్, వినయ్ పాల్గొన్నారు.

రైతులలకు అండగా కూటమి ప్రభుత్వం

రాజంపేట, మార్చి13 ప్రభాతవార్త

దేశానికి పట్టేడన్నం పెట్టే రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అంకితభావంతో పనిచేస్తున్నాయని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్య జగన్మోహన్రాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వీరబల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 3.0 కార్యక్రమం కింద నియోజకవర్గంలోని రైతులకు 15.88 కోట్ల చెక్కునుడిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్ , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడుతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు అండగా నిలిచి పనిచేస్తుందన్నారు. రైతాంగం వ్యవసాయంతో పాటు చిరుధాన్యాలు సాగుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంతేకాకుండా ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయని,అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఉత్పత్తులను పండించేందుకు కొత్త ఆలోచనలతో రైతులు ముందుకు రావాలన్నారు. రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద 27,288 మంది రైతులకు 15.88 కోట్ల రూపాయలు పెట్టుబడి సాయం నేరుగా ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. వైసిపి హయాంలో రైతులు నిరక్ష్యం చేసారని ధ్వజ మెత్తారు. ముఖ్యంగా రైతులకు డ్రిప్ ఇరిగేషన్ లేకుండా ఐదేళ్లపాటు నాశనం చేశారని విమర్శించారు.గత వైకాపా ప్రభుత్వంలో భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులను వైకాపా ఎంపీలు,మేడా రఘునాథరెడ్డి,మిధున్ రెడ్డి,ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురి చేశారని చమర్తి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, టిడిపి మండల కమిటీ అధ్యక్షులు భానుమూర్తి రాజు, కూటమి నాయకులు ,రైతు సంఘం నాయకులు ,వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ చెక్కు విడుదల చేస్తున్న కూటమి నాయకులు

సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలి

శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త:

పీలేరు మండల పరిధిలో ఉన్న ప్రతి ఒక్క రైతు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు మండల శాఖ అధికారులు తో సమావేశమై మండల అభివృద్ధి స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలో ప్రతి ఒక్క లబ్ధిదారునికి అర్హులైన వారికి ప్రభుత్వం మంజూరు చేసే పథకాలు చివరిదాకా చేరాలని ఆయన సూచించారు. ప్రజలకు సేవ చేయని అధికారులను ఇంటికి పంపిస్తానని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా మండలంలో వ్యవసాయం రెవెన్యూ పోలీస్,పంచాయతీ, ఇరిగేషన్ శాఖలపై ప్రత్యేకంగా సమావేశంలో చర్చించడమే కాకుండా అధికారులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసిల్దార్ శివకుమార్, ఎంపీడీవో శివశంకర్, పంచాయతీ ఈవో బ్రహ్మానంద రెడ్డి వ్యవసాయ శాఖ ఏడి రమణరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇన్విజి లేటర్స్కు అవగాహన కార్యక్రమం

రామసముద్రం మార్చి 13 ప్రభాతవార్త

మండలంలో ఉల్లాస్ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపికైన మహిళలకు పరీక్షలను ఈ నెల 15 వతేది ఆదివారం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ తెలిపారు. పరీక్షలు నిర్వహణపై శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంబందిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ 15 సంవత్సరాలు నుంచి 59ఏళ్ల వయసులోపు ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి డ్వామా, డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వీరికి చదువునేర్పే సందర్బంలో పదిమందికి గాను ఒక వాలంటీర్ ను నియమిస్తామన్నారు. ఆదివారం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటలు వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. అభ్యాసం పొందినవారు పరీక్షకు హాజరై తమ ప్రతిభను కనబరచాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ లతీఫ్ఖాన్, ఏపీఎం సాంబ శివ, సిసిలు, వివోలు హాజరయ్యారు.

ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు వెలకట్టలేనివి

సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్

మదనపల్లె క్రైమ్ మార్చి 13 ప్రభాతవార్త.

వైద్య రంగంలో వ్యాధి నిర్ధారణ అనేది చికిత్సకు పునాది అని, ఆ పునాదిని పటిష్టం చేయడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ బాబు కొనియాడారు. గురువారం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన చికిత్స అందాలంటే ముందుగా వారి అనారోగ్యానికి గల కారణాలను ఖచ్చితంగా గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఈ బాధ్యతను ల్యాబ్ టెక్నీషియన్లు అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తారన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల కృషిని గుర్తించి మార్చి 13వ తేదీని ప్రపంచవ్యాప్తంగా ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ బయోకెమిస్ట్ శ్రీనివాసులు, బయోకెమిస్ట్ ఎం.వి. శైలజ, ల్యాబ్ టెక్నీషియన్లు అనురాధ, సుమలత, చంద్రకాంతి, లావణ్య, మహేశ్వరి, నందిని, సాయి లావణ్య, తుషిత, కళ్యాణ్, నవీన్ రెడ్డి, హరినాథ్, జ్ఞానేంద్ర, శ్రీనివాసులు రాజు, గంగాధర్, గణేష్, ఇమ్రాన్, రఫీ, నవీన్, జనార్దన్ రెడ్డి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలాజీ నగర్ వాసుల తాగునీటి కష్టాలకు విముక్తి

లక్కిరెడ్డిపల్లి : మార్చి 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బాలాజీ నగర్ కాలనీ వాసులు గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు శుక్రవారం శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలో తాగునీటి సరఫరా చేసే బోర్ మోటార్ ఒక్కసారిగా కాలిపోవడంతో, ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీరు లేక, నిత్యవసర పనులకు నీరు దొరక్క కాలనీ వాసులు పడుతున్న అవస్థలను గుర్తించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు బాలాజీ నగర్ కాలనీవాసులకు త్రాగునీటి సమస్య లేకుండా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాడు సచివాలయ ఇన్చార్జ్ ఎంపీడీవో నాగేంద్రప్రసాద్ పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

ప్రజా దర్బాల్లో తాగునీటిపై సమస్యలు

మహిళలతో మాట్లాడుతున్న శాసనసభ్యులు నల్లారి కిషన్ కుమార్ రెడ్డి

పీలేరు మార్చి 13 ప్రభాతవార్త:

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పీలేరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయం, కడప రోడ్డు లోని లలితా ఫంక్షన్ హాల్లో 1,2 రెండు సచివాలయాల పరిధిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, అనుబంధ సంఘాలు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ప్రజలు మహిళలు పలుచోట్ల త్రాగునీటి,మురికి కాలువలు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో, ఆయన ప్రజల దగ్గర నుండి అర్జీలు స్వీకరించారు ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్రెడ్డి సంబంధిత అధికారులను అప్పటికప్పుడే ఆయా శాఖకు సంబంధించిన అధికారులకు ఈరోజు వచ్చిన సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీలేరు తహశీల్దార్ శివ కుమార్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ చంద్రశేఖర్రెడ్డి, ఎంపీడీవో డీవో హౌసింగ్ ఏఈ, డిఈ అధికారులు పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్లు రోల్ మోడల్గా ఎదగాలి

రాయచోటి మార్చి 13 ప్రభాతవార్త

స్కౌట్ మాస్టర్లు రోల్ మోడల్గా ఎదగాలి మరియు విద్యార్థులలో క్రమశిక్షణ సేవాభావం పెంపొందించాలని యూనిట్ లీడర్ల సమావేశంలో జిల్లా సెక్రటరీ మడితాడి నరసింహారెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్య జిల్లా రాయచోటి లోని డైట్ నందు ఏర్పాటు చేసిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. స్కౌట్ లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఉంటుందన్నారు. అన్ని రకాల ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పనిసరి అన్నారు. స్కౌట్ నందు చేరి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. అన్నమయ్య జిల్లాలో స్కౌట్ ఉద్యమాన్ని మరింత విస్తరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయడం జరుగుతూ ఉందన్నారు.అనంతరం ఇటీవలే బేసిక్ మరియు అడ్వాన్స్ శిక్షణ పూర్తి చేసుకున్న స్కౌట్ మాస్టర్ లకు, గైడ్ కెప్టెన్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎల్ టి లక్ష్మీకర్, ఆపదమిత్ర కోఆర్డినేటర్ గురునాథరెడ్డి, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ మార్ల ఓబుల్ రెడ్డి, ప్రసాద్, అలిశెట్టి మధు, గైడ్ కెప్టెన్లు శివలీల, సుజాత, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.



శ్రీరాముని చరితమును రాసిన ఘనత కవయిత్రి మొల్లది

మదనపల్లె, మార్చి 13 ప్రభాతవార్త :

సకల గుణాభిరాముడు శ్రీరాముని చరితమును సరళంగా రాసిన ఘనత కవయిత్రి మొల్లమాంబ అంటూ జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ మధుసూదన్రావు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె సబ్కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శ్రీమొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్రావు హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపజిల్లా గోపవరం గ్రామంలో కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అన్నారు. ఈమె రచనాశైలి చాలా సరళమైనదిగా ఉంటుందన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇన్చార్జ్ తేజశ్విని మాట్లాడుతూ మొల్ల రామాయణం ఆరు కాండాలలో 871పద్యాలతో రచించిందన్నారు. ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజుల్లో రాసినట్లు ప్రతీతి అన్నారు. మొల్ల రామాయణం చాలా సరళమైందన్నారు. కావుల ప్రతి ఒక్కరూ మొల్లను ఆదర్శంగా తీసుకోవాలని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షులు వేమనారాయణ, వైస్ ప్రెసిడెంట్ శ్రీరాములు, ట్రెజరర్ రెడ్డప్ప, జనరల్ సెక్రటరీ లోకేష్, ఆర్గనైజర్ గోపి, తెలుగు పండిట్లు ఏవివి. ప్రసాద్శర్మ, గోవిందరాజులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సెనగల కొనుగోలు కేంద్రంలో అవినీతి

ప్రొద్దుటూరు మార్చి 13 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని శనగల రైతుల కోసం మద్దతు ధర కల్పిస్తూ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన శనగల కొనుగోలు కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దళారులుగా ఏర్పడి అవినీతికి పాల్పడుతూ రైతులను దోచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలంలో 5000 ఎకరాలు రాజుపాలెం మండలం సంబంధించి 15000 ఎకరాలు శనగ పంట రైతులు సాగు చేశారన్నారు. సాగుచేసిన పంట మార్కెట్ యార్డ్లోని కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు వచ్చిన రైతుల దగ్గర నుండి అక్రమంగా రసూలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా శనగల తూకం సమయంలో సంచి తూకం 600 గ్రాములు కాగా మూడు కేజీలు అదనంగా సెనగలు దోచుకుంటున్నారని విరుచుకపడ్డారు. ఈ అవినీతి వెనక స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డి ఉన్నారని ఆరోపించారు. గత వైసిపి పాలనలో రైతులకు కొనుగోలు కేంద్రాలను రాజుపాలెం మండలంలో మూడు చోట్ల ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా ఖర్చులు లేకుండా కొనుగోలు చేశామన్నారు. అధికారులు దళారులపై చర్యలు తీసుకుని రైతులకు అన్యాయం జరగకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

పులివెందుల,మార్చి 13 , ప్రభాత వార్త :

నియోజక వర్గంలోని సింహాద్రి పురం మండల పరిధిలోని కాంబల్లి గ్రామంలోని హరిజనవాడలో నిర్మించ తలపెట్టిన శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్రెడ్డి, సతీమణి ఉమాదేవి హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దంపతులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భక్తి మార్గం ద్వారానే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థులందరూ ఐక్యమత్యంతో ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. అలాగే సీతా రామాంజనేయ స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలంద రిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో బూచిపల్లి రమణా రెడ్డి, బొజ్జా మైసూరా రెడ్డి, కొమ్మా శివశంకర్ రెడ్డి, ఓబులరెడ్డి శ్రీనివాస రెడ్డి, కాంబల్లి సర్పంచ్ త్రివేక్ రెడ్డి, మల్లెల శ్రీను, దోజార్ భాస్కర్, నాగేంద్ర, నాగ దస్తగిరి, గంగా ప్రసాద్ రెడ్డి, రామాపురం మహేశ్వర్ రెడ్డి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

పులివెందుల, మార్చి 13 , ప్రభాత వార్త :

సింహాద్రిపురం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు భూమిరెడ్డి ఉమాదేవి ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి 10వేల నగదు ప్రోత్సాహం ప్రకటించారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో, శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భూమిరెడ్డి ఉమాదేవి శుక్రవారం విద్యార్థులకు పెన్నులు మరియు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

కిషోర బాలికలకు హెచ్ పివి వ్యాక్సినేషన్..

వేంపల్లె :మార్చి 13 ప్రభాతవార్త

బాలికల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా హెచ్ పివి టీకా వేస్తోందని తాళ్లపల్లి పిహెచ్సి వైద్యురాలు శాంతి సుశేన్, డా.పృధ్వీకుమార్ రెడ్డి లు వెల్లడించారు. శుక్రవారం తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కిషోర బాలికలకు హెచ్ పివి వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భాశయ ముఖ క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు రక్షణకు హెచ్ పివి టికాని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టికా అందుబాటులో ఉంటుందని, అత్యంత సురక్షితమైన వ్యాక్సిన్ టీకా కేవలం 1415 ఏళ్ల మధ్య బాలికలకు మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరత్నం, ఫకృద్దీన్, అరుణాదేవి, రేణుకాదేవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం

వేంపల్లె:మార్చి 13(ప్రభాత వార్త)

రైతు సంక్షేమమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వాల ధ్యేయమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం సచివాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా 22వ విడత నిధులు విడుదల చేశారన్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న 9.8 కోట్లకు పైగా రైతులకు లబ్ధి చేకూరుతాయని, ప్రతి రైతు కుటుంబానికి రూ.2 వేలు నేరుగా తమ ఖాతాల్లో జమ చేబడుతుందన్నారు. ఈ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.18.640 లక్షల కోట్లు నిధులు జమ చేయబడిందన్నారు. అలాగే దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.4 వేలు జమ అవుతున్నట్లు తెలిపారు. రైతుల ఆర్థికస్థితి మెరుగుదలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవి యాదవ్, రెడ్డయ్య, పుష్పలత, అధికారులు రెడ్డివాణి, ఆంజనేయులు, శివరంజని, మహేష్, రైతులు పాల్గొన్నారు.

బ్రైట్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణి..

సుండుపల్లి, మార్చి 13,ప్రభాతవార్త :



మండలంలోని బ్రైట్ ట్యూషన్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫౌండర్ యాస్మీన్ సుమారు రూ.10 వేల విలువైన పరీక్షా సామాగ్రి అయిన ప్యాడ్లు, పెన్లు, జ్యామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం ట్యూషన్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని, ఈ సంవత్సరం కూడా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహిళా శానిటేషన్ కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం

బద్వేల్ అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త :

పట్టణంలోని గాంధీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణకు సంబంధించి బాలికలకు హెచ్పివి టీకా కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో భాగంగా 14 సంవత్సరాలలోపు బాలికలకు హెచ్పివీ టీకా వేయడం ద్వారా గర్భాశయ ముఖ క్యాన్సర్ను నివారించవచ్చని వైద్యులు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని సూచించారు. అనంతరం మార్చి 8 ఉమెన్స్ డే కి అనుబంధంగా లీడ్స్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పట్టణంలో విశిష్ట సేవలు అందించిన డాక్టర్ పద్మావతి,డాక్టర్ లక్ష్మీదేవి, డాక్టర్ సౌమ్యలను మున్సిపల్ కమీషనర్ నరసింహారెడ్డి శాలువతో సన్మానించడం జరిగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మహిళా శానిటేషన్ కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు, ఈ శిబిరంలో వారికి వారి కుటుంబ సభ్యులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు, బద్వేల్ ప్రాంత ప్రజలకు పలువురు డాక్టర్స్ మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు కోరారు,ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రొద్దుటూరు మార్చి 13 ప్రభాతవార్త

పురపాలక సంఘంలోని మూడవ వార్డులో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సుఖ శాంతులతో అష్ట ఐశ్వర్య ఆరోగ్యాలతో జీవనం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పోరెడ్డి ప్రదీప్ కుమార్ రెడ్డి మూడో వార్డు వైసిపి నాయకులు భాష మరియు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

బద్వేలు ,మార్చి 13 ప్రభాతవార్త

బద్వేల్ నియోజకవర్గంలో 'అన్నదాత సుఖీభవ' ఫేస్-3 నిధుల విడుదల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి, స్టేట్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్,వ్యవసాయ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రితేష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి దూరదృష్టి ఆలోచనలతో ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అంతకుముందు గుంతపల్లి గ్రామంలో వరి పంట పొలాలను రితేష్ రెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం రైతులతో అనుసంధానమై సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ రోసన్న, బొమ్మన విజయ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ ,బొజ్జ అరుణ, సాధనకారి రంతు ,కల్లూరి కృష్ణారెడ్డి, బంగారు గురివి రెడ్డి, బసి రెడ్డి రవికుమార్ రెడ్డి, మురళి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన డీసీసీ బ్యాంక్ చైర్మన్

బద్వేల్ అర్బన్ మార్చి 13 ప్రభాతవార్త :

రంజాన్ మాసంలో ఉపవాసదీక్షల విరమణ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బద్వేల్ పట్టణం ఫాతిమా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారితో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ స్టేట్ ఉపాధ్యక్షులు అమీర్ బాబు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, స్టేట్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా (బిగ్ బాస్), ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షులు ఎస్ఎం భాష జయరాంరెడ్డి, మాజీ టిడిపి ప్రెసిడెంట్ అశోక్ కుమార్ రాజు, కొంకుల రాంబాబు, రామకృష్ణ, ఆరవ శ్రీనివాసులురెడ్డి, పాలకొండు రాజశేఖరరెడ్డి,చిన్నపరెడ్డి, ఫాతిమా మసీద్ ముస్లిం పెద్దలు, ట్రావెల్స్ రసూల్, మోలాలి, మాచుపల్లి కృష్ణారెడ్డి, తోపాటు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళితే జీవితాలు చిత్తవుతాయి

బద్వేల్ అర్బన్ ,మార్చి 17, ప్రభాతవార్త

డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికితే అవి మీ జీవితాలను చిత్తు చేస్తాయని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని తెలిపారు. యువతలో అవగాహన కల్పించేందుకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జనచైతన్య జీపు జాతా నిర్వహించనున్నట్లు శుక్రవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ జీపు జాతాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి మాఫియాను నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, కార్యదర్శి ఎస్కే ఆదిల్, మహిళ కోకన్వీనర్ ఎస్కే ఫాతిమా, పట్టణ ఉపాధ్యక్షులు సి. సుధాకర్, రవికుమార్, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.